సండే స్పెషల్

కల చెదిరే.. కన్నీళ్లే మిగిలే



ధూప్‌సింగ్ తండా.. నాలుగు రోజులుగా బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్న గిరిజనులు. వరదతో విలవిల్లాడిన ముంపు బాధితులు.. ఆ పీడకల నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. శనివారం సాక్షి పలకరించగా.. వారిలో భయం ఇంకా కనిపించింది. సీన్ కట్ చేస్తే.. తెల్లవారితే వినాయక చవితి.. రాత్రి భోజనాలు చేసి నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి మొదలైన చినుకులు కొద్దిసేపట్లోనే జడివానగా మారింది. తెల్లవారేలోగా గంగమ్మ వాగు పోటెత్తింది. వరద విజృంభించి తండాను చుట్టుముట్టింది. అనుకోని ఉపద్రవంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని చెట్టుకొకరు.. పుట్టకొకరు పరుగులు తీశారు. కరెంట్ లేదు, తిండీ తిప్పలు లేవు.. వాన నీటితోనే కడుపు నింపుకున్నారు. ఆ నరకయాతనను గుర్తు చేసుకొని కన్నీటి పర్యంతం అవుతున్నారు.

8లో

న్యూస్‌రీల్

టీచర్ వృత్తి గౌరవప్రదమైంది

కల్హేర్(నారాయణఖేడ్): సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవమైందని ఉమ్మడి మెదక్ జిల్లా వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మార్డి జెడ్పీహెచ్‌ఎస్‌లో టీఎస్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ ఉద్యోగ విరమణ సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండు లక్ష్మణ్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు రాంమోహన్‌రావు, గుండు గోవర్ధన్, వంశీకృష్ణ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు వేగవంతం చేయాలి

గృహనిర్మాణ శాఖ పీడీ చలపతిరావు



ఇళ్ల నిర్మాణం పనులు పరిశీలిస్తున్న పీడీ

హత్నూర(సంగారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ పీడీ చలపతిరావు స్పష్టం చేశారు. హత్నూర మండలం మంగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను పీడీ చలపతిరావు శనివారం పరిశీలించారు. పీడీ చలపతిరావు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి బిల్లులు వస్తున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్ ఏఈ రమ్య, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు నవీన్ కుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రదీప్, మాజీ ఉపసర్పంచ్ యాదగిరి గ్రామ అధ్యక్షుడు కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: అంజయ్య



మొక్కను నాటిన అంజయ్య. చిత్రంలో నీరుపోస్తున్న అధికారులు, నాయకులు

రాయికోడ్(అందోల్): పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతీ ఒక్కరి బాధ్యతని, మొక్కలు పెంచడం అలవాటుగా మార్చుకోవాలని గ్రంథాలయ సంస్థల చైర్మన్ జి.అంజయ్య పేర్కొన్నారు. రాయికోడ్‌లోని మోడల్ స్కూల్ ఆవరణలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్ధప్ప పాటిల్, అధికారులు, నాయకులతో కలిసి శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనలు పాటించి, ప్రభుత్వం కల్పించిన వసతులను, విద్యా పథకాలను వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జగదీశ్,తహసీల్దార్ ఆశాజ్యోతి, ఎంపీడీఓ ఎం ఎం.షరీఫ్, ఆర్ఐ శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపాల్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

చేసిన సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు

జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు



సభలో మాట్లాడుతున్న డీఈఓ

వట్‌పల్లి(అందోల్): విధి నిర్వహణలో అందించిన సేవలతోనే ఏ ఉద్యోగికైనా గుర్తింపు లభిస్తుందని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని పోతులబోగుడా ఉన్నత పాఠశాలలో శనివారం మండల విద్యాధికారి గద్దం గోవింద్‌రెడ్డి పదవీవిరమణ అభినందన సభలో పాల్గొని గోవింద్‌రెడ్డి దంపతులను శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గోవింద్‌రెడ్డి 36 ఏళ్ల ఉద్యోగ సర్వీసులో ఉపాధ్యాయుడిగా, హెచ్‌ఎంగా, ఎంఈఓగా విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేసి ఎంతో మందిని ఉన్నతిగా తీర్చిదిద్దారన్నారు. అంకిత భావంతో పనిచేసిన గోవింద్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో సీఎండీ వెంకటేశం, ఏఎంఓ బాలయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎం రంజిత్‌కుమార్, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

సైన్యానికి సాంకేతిక దన్ను

ఐఐటీహెచ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ 'విగ్రహ'ఏర్పాటు

- రక్షణ రంగానికి అవసరమైన ఆధునిక సాంకేతికతపై పరిశోధనలు
- అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసిన ఐఐటీహెచ్, ఎస్‌డీడీ



ఎంఓయూను చూపుతున్న ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, బ్రిగేడియర్ చతుర్వేది

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ (ఐఐటీ) హైదరాబాద్ భారత సైన్యానికి దన్నుగా నిలవనుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విస్తృత పరిశోధనలు చేస్తున్న ఈ విద్యా సంస్థ ఇకపై దేశ రక్షణ వ్యవస్థ మరింత బలోపేతానికి పరిశోధన సహకారాన్ని అందించనుంది. ఈ మేరకు ఐఐటీహెచ్, ఆర్మీ ట్రైనింగ్ కమాండ్‌కు చెందిన సిమ్యులేటర్ డెవలప్‌మెంట్ డివిజన్ (ఎస్‌డీడీ, సికింద్రాబాద్)తో కీలకం ఒప్పందం చేసుకున్నట్లు ఐఐటీహెచ్ వర్గాలు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించాయి. ఈ ఒప్పందంలో భాగంగా ఐఐటీలో 'విగ్రహ'పేరుతో ఓ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీని స్థాపిస్తున్నారు. ఈ రెండు అత్యున్నత సంస్థలు సంయుక్తంగా శాస్త్రీయ, సాంకేతిక అంశాలపై పరిశోధనలను చేపట్టనున్నాయి.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్, డ్రోన్లు, అగ్మెంటెడ్ వర్చువల్ రియాలిటీ, మానవ రహిత వాహనాలు తదితర అంశాలపై ఈ ఎస్‌ఎస్‌డీ సైన్యానికి శిక్షణను అందిస్తోంది. ఇలాంటి అత్యున్నత సంస్థతో కలిసి ఐఐటీహెచ్ పనిచేయనుంది. అలాగే రక్షణ రంగంలో నూతన ఆవిష్కరణలు, ఇంక్యుబేషన్ కార్యకలాపాలను ప్రోత్సహించనున్నారు. ఐఐటీహెచ్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు ఈ ఎక్సలెన్స్ సెంటర్‌లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశాలుంటాయి. ఈ కీలక ఒప్పందాలపై ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, ఎస్‌డీడీ తరఫున బ్రిగేడియర్ ఏ.కే. చతుర్వేది సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఈ ఒప్పందం నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుందని, రక్షణ దళాల సాంకేతిక సామర్థ్యాలను పెంపొందిస్తుందని అభిప్రాయపడ్డారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలను సాధించడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుందన్నారు.

3 డీ-ప్రింటెడ్ మిలిటరీ బంకర్లు

ఇప్పటికే ఐఐటీ హైదరాబాద్ ఇండియన్ ఆర్మీతో కలిసి 3 డీ-ప్రింటెడ్ మిలిటరీ బంకర్ల నిర్మాణంపై పరిశోధన చేస్తోంది. ప్రపంచంలోనే ఎత్తయిన ప్రదేశం లేహ్‌లో ఈ బంకర్లను నిర్మిస్తోంది. సింప్లిఫోర్జ్ క్రియేషన్స్‌తో కలిసి ఈ ప్రాజెక్టును కొనసాగిస్తోంది. డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ)తో కూడా ఐఐటీహెచ్ కలిసి పనిచేస్తోంది. క్షిపణులు, క్షిపణి రక్షణ వ్యవస్థలకు సంబంధించి పనితీరు విశ్లేషణ, డిజైన్లు, డేటా ఏఐ సాంకేతికత తదితర విభాగాలపై కూడా ఐఐటీహెచ్ సేవలందిస్తోంది. అలాగే తూనీగలు, కీటకాలు, పక్షుల ఆకారంలో గాలిలో ఎగురుతూ సరిహద్దుల్లో నిఘా పెట్టే బయో ఇన్‌స్పైర్డ్ డ్రోన్లు వంటి వాటిపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా భారత సైన్యానికి సాంకేతిక శిక్షణ సంస్థతో కలిపి ఈ ప్రాజెక్టు చేపట్టడం గమనార్హం.

విధి నిర్వహణలో అప్రమత్తం



పరేడ్ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్

సంగారెడ్డి జోన్: విధి నిర్వహణలో పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ సిబ్బందికి శనివారం వీక్లి పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పరితోశ్ మాట్లాడుతూ..శారీరక దారుఢ్యం కోసం ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా వ్యాయామం చేయాలన్నారు. భారీ వర్షాల దృష్ట్యా జిల్లా పోలీసు అధికారులు ఎలాంటి పరిస్థితులలోనైనా స్పందించడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. వినాయక నిమజ్జనం, ఈద్ మిలాద్ ఉన్ నబీ పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునేవిధంగా తగిన బందోబస్తు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్.ఐ.లు రామారావ్, రాజశేఖర్ రెడ్డి, డానియెల్, తదితరులు ఉన్నారు.

మట్టి రవాణ వాహనాల పట్టివేత

- నలుగురిపై కేసు నమోదు
- 'సాక్షి'కథనాలపై అధికారుల్లో కదలిక
- అక్రమ మట్టి రవాణపై అధికారుల నిఘా

సాక్షి ఎఫెక్ట్..

వట్‌పల్లి(అందోల్): అక్రమ మట్టి మాఫియా వట్‌పల్లిలో అనుమతులు లేకుండా సాగిస్తున్న మట్టి దందాపై 'సాక్షి'వరుస కథనాలు ప్రచురించడంతో అధికారులు మేల్కొన్నారు. మట్టి మాఫియాపై నిఘా పెట్టి అక్రమ రవాణ వాస్తవమేనని నిర్ధారించుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు నేరుగా ఘటనా స్థలానికి వెళ్లారు. అక్కడ మట్టిని తవ్వుతున్న జేసీబీతోపాటు టిప్పర్, ట్రాక్టరుతో మరో మూడు వాహనాలను పట్టుకున్నారు. వాటిని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్సై లవకుమార్ శనివారం మీడియాకు వెల్లడించారు. అక్రమ మట్టి రవాణపై దృష్టి సారించామని, అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దారు చంద్రశేఖర్ 'సాక్షి'కి తెలిపారు. సెలవు రోజుల్లో కుడా పోలీసుల నిఘా ఉంచుతామన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న జేసీబీ

అన్ని రంగాల్లో ముందుండాలి



బహుమతులు అందజేస్తున్న లలిత కుమారి

ఐసీడీఎస్ పీడీ లలిత కుమారి

నారాయణఖేడ్: ఆడ పిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా స్త్రీ శిశు వయోవృద్ధుల సంక్షేమ అధికారి లలిత కుమారి పేర్కొన్నారు. నిజాంపేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శనివారం 'బేటీ బచావో, బేటీ పడావో'కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆడ పిల్లలు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. డీఎస్పీ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ..పోక్సో చట్టం, షీ టీమ్ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీడీపీవో సుజాత, ఎంపీడీవో సంగ్రాం, ఏసీడీపీవో సుశీల, జిల్లా మహిళా సాధికారిత కేంద్రం కోఆర్డినేటర్ పల్లవి, తహశీల్దార్ నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు తాళం చెవిలను అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

ఇల్లు వచ్చేసిందోచ్

డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల తాళాల అప్పగింత

మండలంలోని హోతి(కె) గ్రామ శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించగా అందులో మిగిలిన వాటిని కూడా అధికారులు పంపిణీ చేసేశారు. ఈ మేరకు మిగిలిపోయిన ఇళ్లకు సంబంధించి తాళం చెవిలను లబ్ధిదారులకు శనివారం రెవెన్యూ అధికారులు అందజేశారు. దీంతో లబ్ధిదారులు సంతోషంతో స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యుడు మహిపాల్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

– జహీరాబాద్

డుమ్మాలకు చెక్

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అందుబాటులోకి ముఖ హాజరు విధానం



ఎఫ్ఆర్‌ఎస్ విధానంలో విద్యార్థుల హాజరు తీసుకుంటున్న అధ్యాపకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు ఇష్టానుసారంగా డుమ్మాలు కొట్టేందుకు వీలు లేకుండా పోయింది. కాలేజీల్లో విద్యార్థుల హాజరు పెంచేందుకు ముఖ హాజరు (ఎఫ్ఆర్‌ఎస్) విధానానికి శ్రీకారం చుట్టింది. సాధారణంగా చాలామంది విద్యార్థులు ఉదయం వచ్చి మధ్యాహ్నం డుమ్మా కొట్టడం, మరి కొందరు కళాశాలకు వెళ్తున్నామని చెప్పి కాలేజీకి రాకుండా గైర్హాజరు కావడంలాంటివి చోటు చేసుకుంటుడటంతో హాజరు శాతం తగ్గిపోయి విద్యార్థులే నష్టపోతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ఇంటర్ బోర్డు విద్యార్థుల డుమ్మాలపై దృష్టి సారించి ఎఫ్ఆర్‌ఎస్ విధానాన్ని తీసుకొచ్చింది.

ఈనెల 23 నుంచే మొదలైన ఎఫ్ఆర్‌ఎస్

జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈనెల 23 నుంచి ఎఫ్ఆర్‌ఎస్(ఫేషియల్ రికగ్నేషన్ సిస్టమ్)కు ఇంటర్‌బోర్డు శ్రీకారం చుట్టింది. సీజీజీ(సెంటర్ బోర్డు ఫర్ గుడ్ గవర్నెన్స్) సాంకేతిక సహకారంతో ఇంటర్ బోర్డు అధికారులు టీజీబీఐఈ, ఎఫ్ఆర్‌ఎస్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. గతంలో రిజిస్టర్ విధానం ద్వారా హాజరు తీసుకునేవారు. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన కొత్త విధానం ద్వారా ఉదయం, మధ్యాహ్నం రెండుసార్లు అధ్యాపకులు మొబైల్ ఫోన్ల ద్వారా విద్యార్థుల హాజరును నమోదు చేస్తున్నారు. విద్యార్థులు ఏ కారణంతోనైనా పాఠశాలకు డుమ్మాకొడితే ఆ సమాచారం విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు సైతం వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. విద్యార్థులు కళాశాలలకు డుమ్మా కొట్టే సమాచారం తల్లిదండ్రులు, అధికారులకు తెలియనుండటం వల్ల డుమ్మాలకు స్వస్తి పలికే అవకాశాలున్నాయి. దీంతో విద్యార్థుల హాజరు పెరడంతోపాటు విద్యాపరంగా మంచి ఫలితాలు వచ్చే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో 20 కళాశాలలు

జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ఆయా కళాశాలల్లో మొదటి సంవత్సరంలో 4,623 మంది, ద్వితీయ సంవత్సరంలో 3,350 మంది, మొత్తం 7,973 విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. 140 మందికి పైగా బోధన సిబ్బంది ఉండగా, 50కిపైగా బోధనేతర సిబ్బంది ఉన్నారు.

> **ఎఫ్ఆర్‌ఎస్ బాగుంది**
>
> కళాశాలల్లో ముఖ హాజరు విధానం ప్రవేశ పెట్టడం చాలా బాగుంది. దీంతో కాలేజీకి డుమ్మాలు కొట్టేవారు దొరికిపోతారు. ముఖ్యంగా ఇంట్లో ఈ విషయం తెలిసే అకాశం ఉన్నందున దాదాపు డుమ్మాలకు చెక్ పడనుంది.
>
> – మల్లేశ్వరీ విద్యార్థినీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల హద్నూర్

అన్ని కళాశాలల్లో అమలు



విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఇంటర్ బోర్డు తీసుకొచ్చిన ఎఫ్ఆర్‌ఎస్ విధానాన్ని అన్ని కళాశాలల్లో అమలు చేస్తున్నాం. దీని వల్ల విద్యార్థుల హాజరు శాతం పెరుగుతుంది.

– గోవిందరాం డీఐఈఓ–సంగారెడ్డి

పకడ్బందీగా నిమజ్జన ఏర్పాట్లు



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సురేశ్ షెట్కార్

ఎంపీ సురేశ్ షెట్కార్

జహీరాబాద్: వినాయక విగ్రహాల నిమజ్జనంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఎంపీ సురేశ్ షెట్కార్ అధికారులకు సూచించారు. జహీరాబాద్ పట్టణంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం చేస్తున్న ఏర్పాట్లను ఆయన శనివారం పరిశీలించారు. మండలంలోని కొత్తూర్(బి) గ్రామ శివారులోని నారింజ ప్రాజెక్టును సందర్శించి సమీపంలో ఉన్న విద్యుత్ స్థంభాలకు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో మాజీమంత్రి ఎ.చంద్రశేఖర్, పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి శుక్లవర్ధన్‌రెడ్డి, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హన్మంత్‌రావుపాటిల్, పి.నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మక్సూద్, కండెం నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సింగూరుకు పోటెత్తిన వరద

- ఏడు గేట్లు ఎత్తి నీరు విడుదల
- ఇన్‌ఫ్లో 71,025 క్యూసెక్కులు.... ఔట్ ఫ్లో 74,722 క్యూసెక్కులు



సింగూరు ప్రాజెక్టు వరవళ్లు

పుల్‌కల్(అందోల్): రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. మునిపల్లి మండలం దుబ్బవాగు, రాయికోడ్,రేగోడ్ మండలాలలో కురిసిన నీరంతా డ్యామ్‌లోకి చేరుకుంటోంది. ఎగువ నుంచి ప్రాజెక్టులోకి 71,025 క్యూసెక్కుల నీరు చేరింది. దీంతో అధికారులు ఏడు గేట్‌లను ఎత్తి దిగువకు 74,722 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. నాలుగు గేట్‌లు రెండు మీటర్లు, మూడు గేట్‌లు రెండున్నర మీటర్లు ఎత్తారు. జెన్‌కోకు 1,732 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ప్రాజెక్టు అదికారులు నిరంతరం అప్రమత్తంగ ఉంటున్నారు.ఏడు గేట్‌లు ఎత్తడంతో పర్యాటకులు ప్రాజెక్టు వద్ద సందడి చేస్తున్నారు.

డ్వాక్రా మహిళలకు ఆర్టీసీ బస్సులు

త్వరలో జిల్లాకు మంజూరు

- ఆర్టీసీకి అద్దె ఇవ్వనున్న మహిళా సమాఖ్య సంఘాలు
- కసరత్తు చేస్తున్న అధికారులు



సంగారెడ్డి టౌన్: గ్రామీణ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'ఇందిరా మహిళా శక్తి'పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా మహిళల స్వయం ఉపాధికి బాటలు వేయడంతోపాటు వారిని వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా రుణాలను అందజేస్తోంది. వీటితోపాటు మహిళా క్యాంటీన్లు, డెయిరీ పార్లర్లు, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంక్‌ల బాధ్యతలను అప్పగించింది. ప్రస్తుతం మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలు ఇప్పించి వారి ద్వారా బస్సులను కొనుగోలు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ బస్సులను ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా అధికారులు కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు. దీని ద్వారా మహిళలకు స్థిరమైన ఆదాయం రావడంతోపాటు బస్సుల కొరత సైతం తీరుతోంది. జిల్లాలో మూడు డిపోల పరిధిలో ప్రస్తుతం 260 బస్సులుండగా మరికొన్ని మహిళా సంఘాల యొక్క బస్సులు పెరగనున్నాయి.

నెలకు రూ.70వేల వరకు ఆదాయం

జిల్లావ్యాప్తంగా 695 గ్రామ సంఘాలుండగా, అందులో 25 సమాఖ్య మహిళా సంఘాలు, ఒక లక్ష 95వేల మహిళా సభ్యులున్నారు. ప్రభుత్వం రూ.30 లక్షలు ఇవ్వడంతో, మహిళా సమాఖ్య సంఘాల నుంచి రూ.6 లక్షలు తీసుకుని బస్సును కొనుగోలు చేయనున్నారు. నెల నెలా సుమారు రూ.60 నుంచి రూ.70 వేల వరకు ఆదాయం మహిళా సమాఖ్య సంఘాలకు సమకూరనుంది. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించింది. ఈ క్రమంలో బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగడంతో బస్సుల కొరత ఏర్పడింది. పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచడం ఆర్టీసీకి భారంగా మారింది. ఈ క్రమంలో మహిళా సంఘాల అద్దె బస్సుల వినియోగించడంతో బస్సుల కొరత కూడా కొంత తగ్గనుంది. ప్రైవేట్ ఆపరేటర్ల నుంచి బస్సులను అద్దెకు తీసుకునే బదులు మహిళా సంఘాలు కొనుగోలు చేసిన బస్సులను తీసుకుంటుండటంతో ఇటు ఆర్టీసీకి, అటు మహిళా సంఘాలకు లాభం చేకూరనుంది.

> **మహిళా సంఘాలకు ఆదాయం**
>
> 
>
> బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడంతో మహిళా సంఘాలకు నెలనెలా డబ్బులు వస్తుంటాయి. జిల్లా అధికారుల సమన్వయంతో త్వరలోనే ఇది అమలు కానుంది. ప్రయాణికులకు కొంతమేర ఇబ్బందులు తగ్గనున్నాయి.
>
> –జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి సూర్యారావు

క్లుప్తంగా

మీ సేవలు భేష్: కలెక్టర్ హైమావతి



దామోదర్‌రావు దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్



మిషన్‌భగీరథ ఈఈని సన్మానిస్తున్న కలెక్టర్

సిద్దిపేటరూరల్: జిల్లాను గౌరవప్రదమైన స్థానంలో నిలపడంలో హౌసింగ్ పీడీ దామోదర్‌రావు, మిషన్ భగీరథ ఈఈ గిరిధర్ అందించిన సేవలు అమోఘమని కలెక్టర్ కె. హైమావతి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో దామోదర్‌రావు, గిరిధర్‌ల పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాను మొదటగా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం మొదలైందని, దీనిపై ఎప్పటికప్పుడు పీడీతో చర్చించి ముందుకెళ్లానన్నారు. మిషన్ భగీరథ సైతం రోజువారీగా ప్రజలకు నీరందించడం అభినందనీయమన్నారు. ఇరువురి శేష జీవితం బాగా ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. మిషన్ భగీరథ ఈఈ గిరిధర్ మాట్లాడుతూ నీటి సరాఫరా చేయడంలో అధికారులు బాగా సహకరించారన్నారు. హౌసింగ్ పీడీ.దామోదర్‌రావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం సక్సెస్ చేయడానికి రాత్రివేళల్లో సైతం విధులు నిర్వహించినట్లు తెలిపారు.

కొమురవెల్లి నూతన ఈవోగా అంజనీదేవి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ నూతన ఈవోగా కె.అంజనీదేవిని నియమిస్తూ దేవాదాయశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. దేవాదాయశాఖ కార్యాలయంలో జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారిగా (అసిస్టెంట్ కమిషనర్)గా విధులు నిర్వహిస్తున్న అంజనీదేవికి ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఇక్కడ ఈవోగా పని చేస్తున్న అన్నపూర్ణ నేటితో పదవీ విరమణ పొందుతున్నారు. సోమవారం నూతన ఈవో బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

పోలీస్ స్టేషన్ తనిఖీ

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ పరితోష్ పంకజ్ శనివారం తనిఖీ చేశారు. ఈ సదర్భంగా పోలీసుల పనితీరు, స్టేషన్ పరిసరాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వినాయక నిమజ్జనంలో తీసుకోవాల్సిన భద్రత చర్యల గురించి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదు దారులతో స్నేహంగా వ్యవహరించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పనిచేయాలని ఆదేశించారు.

నాటు సారా స్వాధీనం

నారాయణఖేడ్: నాటు సారాను తయారు చేస్తున్న వ్యక్తిని పట్టుకొని, 16.75లీటర్ల సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ టీం ఎస్‌ఐ హనుమంతు, అనుదీప్ వివరాల ప్రకారం... ఖేడ్ మండలం శేరి తండాలో కేతావత్ హిరామన్ ఇంట్లో అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం దాడులు చేసి సారాయిని స్వాధీనం చేసుకుని, బట్టిని ధ్వసం చేశారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ డీసీ హరికిషన్ ఆదేశాల మేరకు దాడులు చేసినట్లు తెలిపారు. సిబ్బంది అంజిరెడ్డి, అరుణ్‌జ్యోతి, రాజేశ్ ఉన్నారు.

ఆర్‌ఎంపీ వైద్యుడిపై కేసు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి నిర్వాహకుడు (ఆర్‌ఎంపీ) వైద్యుడు సుదర్శన్‌పై కేసు నమోదైంది. ఎస్సై శ్రీనివాస్ వివరాల ప్రకారం... గ్రామంలో క్లినిక్ పేరిట యథేచ్ఛగా ఆస్పత్రి పేరు పెట్టుకొని ప్రాథమిక వైద్య చికిత్సలకు బదులుగా అత్యవసర వైద్యం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలోనే జగదేవ్‌పూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థి యశ్వంత్ డెంగీ వ్యాధి లక్షణాలతో ఆస్పత్రికి వచ్చాడు. ప్రాథమిక చికిత్స అందించి ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేయాలి. కానీ ఆర్‌ఎంపీ వైద్యుడు సుదర్శన్ అనుభవ రాహిత్యంతో అత్యవసర వైద్యం చేయడంతో విద్యార్థి మృతి చెందినట్లు కుటుంబీకులు డీఎంహెచ్‌ఓ ధన్‌రాజ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కల చెదిరే.. కన్నీళ్లే మిగిలే



నేలమట్టమైన గుడిసెలో సామగ్రిని తీసుకుంటున్న మహిళ

సండే స్పెషల్

ధూప్‌సింగ్ తండా.. నాలుగు రోజులుగా బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్న గిరిజనులు. వరదతో విలవిల్లాడిన ముంపు బాధితులు.. ఆ పీడకల నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. శనివారం సాక్షి పలకరించగా.. వారిలో భయం ఇంకా కనిపించింది. సీన్ కట్ చేస్తే.. తెల్లవారితే వినాయక చవితి.. రాత్రి భోజనాలు చేసి నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి మొదలైన చినుకులు కొద్దిసేపట్లోనే జడివానగా మారింది. తెల్లవారేలోగా గంగమ్మ వాగు పోటెత్తింది. వరద విజృంభించి తండాను చుట్టుముట్టింది. అనుకోని ఉపద్రవంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని చెట్టుకొకరు.. పుట్టకొకరు పరుగులు తీశారు. కరెంట్ లేదు, తిండీ తిప్పలు లేవు.. వాన నీటితోనే కడుపు నింపుకున్నారు. ఆ నరకయాతనను గుర్తు చేసుకొని కన్నీటి పర్యంతం అవుతున్నారు.

– హవేళిఘణాపూర్/మెదక్‌అర్బన్/మెదక్‌జోన్/మెదక్‌మున్సిపాలిటీ/రామాయంపేట/చిన్నశంకరంపేట

ఇంకా వీడని భయం

- పండగ పూట ప్రళయ ఘంటికలు
- తిండీ తిప్పలు లేవు.. వాన నీళ్లే ప్రాణాధారం
- రెండు గంటల మృత్యుపోరాటం
- ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్న ముంపు బాధితులు

బతుకుతామనుకోలేదు..



మంగళవారం రాత్రి నుంచి వర్షం ప్రారంభం అయింది. చాయ్ ఏ తాగి అందరం ఇంట్లో కూర్చున్నాం. బుధవారం ఉదయం ఒక్కసారిగా ఇంటిలోకి వరద వచ్చింది. బయటకు రాగానే ఎటూ వెళ్లలేని పరిస్థితి. నిచ్చెన ద్వారా అందరం ఇంటిపైకి ఎక్కాం. అప్పటికే వరద ఉధృతి పెరిగింది. భయం భయంగా గడిపాం. బతుకుతామని అనుకోలేదు.

– లచ్చా, ధూప్‌సింగ్ తండా

పిల్లలను ఎత్తుకొని ట్యాంక్ ఎక్కాను



ఉన్న ఫలంగా వరద ఇంట్లోకి రావడంతో సర్వం వదిలి నా ఇద్దరు పిల్లలు, అత్త, మామను తీసుకొని ఇంటి పక్కనే గల వాటర్ ట్యాంకు ఎక్కాను. పైకి ఎక్కాక మా కూతురు అమ్మా నా స్కూల్ బస్తా ఏది..? అని అడిగితే నా బిడ్డను పట్టుకొని ఏడ్చాను.

– సౌందర్య, ధూప్‌సింగ్ తండా

కొట్టుకుపోతుంటే కాపాడారు



బుధవారం ఉదయం చాయ్ తాగేందుకు తండాలోని చాయ్ కొట్టుకు వెళ్లాను. ఒక్కసారిగా వరద రావడంతో పిల్లలు ఏమయ్యారనే ఆతృతతో ఇంటికి పరుగు పెట్టాను. వరద తాకిడికి కొట్టుకుపోతుండగా చాయికొట్టులో ఉన్న ముగ్గురు యువకులు వచ్చి కాపాడారు.

– లాల్యా, ధూప్‌సింగ్ తండా

క్షణమొక యుగం..

పోటెత్తిన వరదలు తండా వాసులకు నష్టాన్ని మిగిల్చాయి. మూడు రోజుల పాటు మిద్దెలెక్కి.. రాత్రింబవళ్లు క్షణమొక యుగంలా గడిపారు. వాన నీళ్లు తాగుతూ ప్రాణాలు దక్కించుకున్నారు. వానకు తడుస్తూ వణికే చలిలో వృద్ధులు, చిన్న పిల్లలను కాపాడుకోవడానికి వారు పడిన అవస్థలు వర్ణనాతీతం. కానీ ఇంటికి వచ్చే సరికి ఎవుసంలో తోడుండే మూగ జీవాలు జల ప్రవాహానికి బల య్యాయి. నిత్యావసర సామగ్రి బురదలో కూరుకుపోయాయి. తిండి గింజలు నీటి పాలయ్యాయి. పంటలు పాడైపోయాయి. కరెంట్ లేక బయట వారితో మాట్లాడేందుకు ఫోన్లు లేక, చిమ్మ చీకట్లో పాములు, తేళ్ల భయంతో గడిపిన, నరక క్షణాలు తమకు కాళరాత్రులు మిగిల్చాయని వాపోయారు.



వరదలో తడిచిన బియ్యాన్ని చూపుతున్న మహిళా

ఇప్పుడిప్పుడే వర్షబాధిత ప్రాంతాలైన ధూప్‌సింగ్ తండా, రాజ్‌పేట, రామాయంపేట, సదాశివనగర్, మెదక్ పట్టణం, పాపన్నపేటలోని రాజ్యాతండాలు, చిన్నశంకరపేటలోని కొన్ని ప్రాంతాలు తేరుకుంటున్నాయి. సహాయక చర్యలు అందుతున్నాయి. మెల్లమెల్లగా బాధితులు సహాయక శిబిరాల నుంచి ఇళ్లకు చేరుకుంటున్నారు. కానీ చేతికొచ్చిన పంట నీటి పాలై, పొలాల్లో ఇసుక మేటలు దర్శనమిస్తున్నాయి. బురదమయమైన ఇల్లు, నీటి పాలైన నిత్యావసర వస్తువులు, చెదిరిన గూడు చూసి కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. వినాయక చవితి రోజున వరదలు మిగిల్చిన చేదు జ్ఞాపకాలు బాధితులను వెంటాడుతున్నాయి.

జలదిగ్బంధంలో తండాలు, కాలనీలు

రామాయంపేట మండలంలో కేవలం 6 గంటల వ్యవధిలో 20 సెం.మీ. వర్షం కురిసింది. సదాశివనగర్ తండా నాలుగు రోజులుగా జలదిగ్బంధంలోనే చిక్కుకుంది. అటవీ ప్రాంతంలో ఉన్న తండాకు ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. తండాలో ఇద్దరు గర్భిణులు ఉన్నట్లు సమాచారం. రామాయంపేటలోని అక్కల బస్తీ, శ్రీనగర్‌కాలనీ వరద నీటిలో చిక్కుకున్నాయి. ఇళ్లలోకి నీరు చేరి బుర దమయంగా మారాయి. తిండి గింజలు తడిసిపోయాయి. పాపన్నపేట మండలం రాజ్యా, కొత్యా, రుగ్యా, జైరాం, పోంలా తండాల మధ్య ఉన్న కుంట కట్టకు గండి పెట్టడంతో, బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. పలు చోట్ల ఇళ్లుకూలి పోయాయి. పంటలు నీట మునిగాయి. చిన్నశంకరంపేట మండలం నార్సింగి నుంచి శేరిపల్లి వరకు గన్నేరు కుంట పొంగి పొర్లడంతో పంటలు నాశనమయ్యాయి. నార్సింగి వద్ద జాతీయ రహదారి ధ్వంసమైంది. టీ.మందాపూర్ వాసులను వరద భయంతో పండగ పూట సహాయక శిబిరంలో ఉంచారు. మెదక్ పట్టణంలోని గాంధీనగర్‌లో ఇళ్లలోకి నీళ్లు వచ్చాయి. పోచారం ప్రాజెక్టుకు ప్రమాదం పొంచి ఉందనే భయంతో అధికారులు సర్దన గ్రామస్తులను మెదక్‌లోని సహాయక శిబిరాలకు తరలించారు.



ఇంకా ముంపులోనే రామాయంపేట శ్రీనగర్ కాలనీ



ఇంట్లో పేరుకుపోయిన బురదను చూపుతున్న మహిళ



ఆదుకోవాలని వేడుకుంటున్న ధూప్‌సింగ్ తండా వాసులు

బిడ్డలను తీసుకొచ్చేందుకు వెళ్లి..



రోదిస్తున్న యాదాగౌడ్ కుటుంబీకులు

రాజ్‌పేటకు చెందిన బెస్త సత్యనారాయణ, దామరంచ యాదాగౌడ్ ప్రాణ స్నేహితులు. హాస్టల్‌లో ఉంటున్న తమ బిడ్డలను వినాయక చవితికి ఇంటికి తీసుకొచ్చేందుకు మెదక్ బయల్దేరారు. మార్గమధ్యలో వరద ముంచెత్తడంతో చిక్కుకున్నారు. కొద్దిసేపు ఆటోను అడ్డం పెట్టుకొని జీవన పోరాటం చేశారు. వరద ఉధృతికి అది కాస్తా కొట్టుకుపోగా, పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఆసరాగా చేసుకొని, కుటుంబీకులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు హెలిక్యాప్టర్ కోసం ప్రయత్నాలు చేశారు. కానీ వాతావారణ అనుకూలించకపోవడంతో సాధ్యం కాలేదు. చివరి క్షణం వరకు ప్రయత్నించిన స్నేహితులు చివరకు, అందరి కళ్లేదుటే ఒక్కసారిగా నీటిలో కొట్టుకుపోయారు.

మోదుగు ఆకులతో వినాయకుడు

తీర్చిదిద్దిన ఫార్మసీ గ్రాడ్యుయేట్

వర్గల్(గజ్వేల్): పర్యావరణానికి చేటు చేసే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ గణపతులు వద్దు.. పర్యావరణ హిత గణపతులే మేలు అంటున్నాడు వర్గల్‌కు చెందిన ఫార్మసీ గ్రాడ్యుయేట్ అయ్యగల్ల దయాకర్. ప్రతి యేటా పర్యావరణ హిత గణపతిని తానే తయారు చేసి పూజిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఈసారి మోదుగాకులతో గణపతిని కళాత్మకంగా తీర్చిదిద్దాడు. సంకల్పం ఉంటే సాధ్యం కానిది లేదన్నట్లు నాలుగేళ్ల క్రితం 2021లో మట్టి వినాయకుడిని, 2022లో వినూత్నంగా కాగితాలతో, 2023లో గోనెసంచులతో (గన్నీ బ్యాగ్) గణేశుడిని తయారు చేసి కళాత్మకంగా తీర్చిదిద్దాడు. తన ఇంట్లో ప్రతిష్ఠించుకొని పూజలు చేశాడు. గత సంవత్సరం అమ్మమ్మ మృతితో నవరాత్రోత్సవాలు జరుపుకోలేదు. తాజాగా వినూత్న రీతిలో మోదుగ ఆకులు వినియోగించి 7 అడుగుల గణపతిని తయారు చేశాడు. సమాజంలో మార్పే లక్ష్యంగా పర్యావరణహిత వస్తువులతో వినాయకుడిని తయారుచేస్తూ ప్రచారం చేస్తున్నట్లు దయాకర్ పేర్కొ న్నాడు. ఆ యువకుడిని గజ్వేల్ శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామ రాజు అభినందిస్తూ జ్ఞాపిక అందజేసి సన్మానించాడు.



ఆకట్టుకుంటున్న గణపతి

కుంటలో పడి వ్యక్తి మృతి

రెస్క్యూ టీం సహాయంతో శవాన్ని బయటకు తీసిన పోలీసులు



సాయిబాబు

చేర్యాల(సిద్దిపేట): ప్రమాదవశాత్తు కుంటలో పడిన వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని వేచరేణి గ్రామంలో శనివారం ఉదయం వెలుగు చూసింది. స్థానికులు, కొమురవెల్లి పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఎగుర్ల సాయిబాబు(30) శుక్రవారం వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో పలు చోట్ల వెతికిన కుటుంబ సభ్యులు పొలం దగ్గర నుంచి వచ్చే దారిలో కుంట వద్ద సాయిబాబు బైక్‌ను గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా కొమురవెల్లి ఎస్‌ఐ రాజు, తహసీల్దార్ దిలీప్‌నాయక్ కుంట వద్దకు వెళ్లి రెస్క్యూ టీం సహాయంతో శవాన్ని బయటకు తీశారు. పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు దారి పక్కనే ఉన్న కుంటలో పడినట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఘటనా స్థలానికి వచ్చి గాలింపు చర్యలను పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..



బొర్ర పర్శరాములు

బెజ్జంకి(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సౌజన్య కథనం మేరకు... ముత్తన్నపేట గ్రామానికి చెందిన బొర్ర పర్శరాములు(48) , భార్య, ఇద్దరు కుమారులతో కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 20న గ్రామం నుంచి మండల కేంద్రానికి బైక్‌పై సరుకుల కోసం వెళ్తుండగా పంది అడ్డు వచ్చి బైక్‌ను ఢీకొంది. దీంతో కిందపడ్డ అతడి తలకు తీవ్ర గాయమైంది. వెంటనే అంబులెన్సులో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఈనెల 23న కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా ఈ ఘటనపై స్వేరోస్, ఎంఆర్‌పీఎస్, దళిత శక్తి సంఘాల ఆధ్వర్యంలో గ్రామస్తులు బెజ్జంకి గ్రామ పంచాయతీ వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు.

బహిర్భూమికి వెళ్లి...



చాకలి మల్లేశం

కౌడిపల్లి(నర్సాపూర్): బహిర్భూమికి వెళ్లిన యువకుడు నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని తునికి గ్రామంలో జరిగింది. శనివారం ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చాకలి సత్తయ్యకు ఇద్దరు భార్యలు. పెద్దభార్యకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చిన్న కొడుకు చాకలి మల్లేశం(28) ఈనెల 28న రాత్రి బహిర్భూమికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. ఆరోజు రాత్రి కుటుంబ సభ్యులు పలుచోట్లు వెతికినా అతని ఆచూకీ దొరకలేదు. కాగా శనివారం ఉదయం గ్రామ సమీపంలోని కలీల్‌సాగర్ చెరువులో మల్లేశం మృతదేహం నీటిపై తేలడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గుర్తించి బయటకు తీశారు. ఇదిలా ఉండగా మృతుని అన్న శ్రీనివాస్ సైతం సుమారు ఆరునెలల క్రితం పశువులు మేపేందుకు వెళ్లి ఫిట్స్ రావడంతో చెరువులో మునిగి చనిపోయాడు. ఆరునెలల్లో అన్నదమ్ములిద్దరూ మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

హాస్టల్ విద్యార్థిని అదృశ్యం

నారాయణఖేడ్: విద్యార్థిని అదృశ్యమైంది. ఈ ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా... నారాయణఖేడ్‌లోని ఎస్సీ కళాశాల బాలికల హాస్టల్‌లో ఉంటూ వడ్డూరి సంధ్య (18) పట్టణంలోని నలంద వొకేషనల్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ చదువుతుంది. ఈనెల 22న కళాశాలకు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. హాస్టల్ వెల్ఫేర్ అధికారి రజిత పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

చికిత్స కోసం వచ్చి..



పోచయ్య

సంగారెడ్డి క్రైమ్: చికిత్స నిమిత్తం పట్టణానికి వచ్చిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్ వివరాల ప్రకారం... సదాశివపేట మండలం ఏటిగడ్డ సంగ్యం గ్రామానికి చెందిన మంగు పోచయ్య(48) ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో చికిత్స కోసం సంగారెడ్డి మండలంలోని ఇర్గిపల్లి గ్రామానికి ఈ నెల 29న ఉదయం 10 గంటల సమయంలో ఇంటి నుంచి గ్రామానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారులతో డీఈఓ శ్రీనివాస్ రెడ్డి

సిద్దిపేటజోన్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులను శనివారం ఘనంగా సన్మానించారు. స్థానిక టీటీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2024–25 సంవత్సరానికి సంబంధించిన క్రీడాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, స్కూల్ అండ్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సౌందర్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయాలి

- కౌన్సెలింగ్ ద్వారా సెర్ప్ సిబ్బంది బదిలీ
- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్

సిద్దిపేటరూరల్: సెర్ప్ సిబ్బంది మహిళా సంఘాల బలోపేతానికి బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సీఈవో ఆదేశాల మేరకు సెర్ప్ సిబ్బందికి కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని సెర్ప్ సిబ్బందిని ఎల్ –2, ఎల్ –1, ఎంఎస్ సీసీఎస్ 115 మంది ఉద్యోగులను బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలో దాదాపు అన్ని మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్ అందించామన్నారు. ప్రతి మహిళా సంఘం ఒక రిజిస్టర్ పెట్టి ఎక్కడ ఏ ఏ కార్యక్రమాల్లో ఉపయోగించారు? ఎంత ఆదాయం వచ్చింది? అనే విషయాలు నమోదు చేసుకోవాలన్నారు. క్లస్టర్ల వారీగా ప్రజలకు డ్రై డేపై, నీటి నిల్వతో దోమల లార్వా పెరిగి, వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, అదనపు డీఆర్డీఓ సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ ఫామ్‌పై పోలీసుల దాడి

210 కిలోల కల్తీ నెయ్యి స్వాధీనం



కల్తీ నెయ్యిగా అనుమానిస్తున్న డబ్బాలను ఆటోను స్వాధీనం చేసుకున్న పోలీసులు

హత్నూర(సంగారెడ్డి): కల్తీ నెయ్యి తయారు చేస్తున్నారన్న అనుమానంతో సీసీఎస్ పోలీసులు దాడి చేసి సుమారు 210కేజీలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని గోవిందరాజు పల్లి గ్రామ శివారులోని మధుప్రియ డెయిరీ ఫామ్‌పై పోలీసులు శనివారం దాడి చేశారు. 10 కేజీల నెయ్యి బకెట్లు 16, 30 లీటర్ల పెద్ద క్యాన్లు రెండు, కాటన్ మంచి నూనె ప్యాకెట్లు, కార్న్‌ఫ్లోర్ పౌడర్, టెస్టింగ్ సాల్ట్ ప్యాకెట్, మిల్క్ పౌడర్, బేకింగ్ సోడా, ఇతర కెమికల్ వస్తువులను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. డెయిరీ నిర్వాహకుడితోపాటు ఆటో, కల్తీ నెయ్యిగా భావిస్తున్న డబ్బాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్సై శ్రీధర్ రెడ్డిని సంప్రదించగా స్వాధీనం చేసుకున్న వాటిని స్టేషన్‌లో ఉంచామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వచ్చిన తర్వాత ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేస్తామని తెలిపారు. కాగా గతంలో కూడా ఈ డెయిరీపై కల్తీ పాలు తయారు చేస్తున్నారని కేసు నమోదు చేశారు.

వర్షానికి తెగిపోయిన రోడ్లు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ఆకారం బ్రిడ్జిపై నుంచి వెళుతున్న నీటి ప్రవాహం

దుబ్బాకరూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లన్నీ తెగిపోయాయి. కామారెడ్డి జిల్లాకు వెళ్లాలంటే బీబీపేట వద్ద రోడ్డు కోతకు గురైంది. అలాగే నర్మాల నుంచి వెళ్లాలంటే మానేరు వాగు పొంగి పొర్లడంతో రోడ్డుపై నుంచి నీటి ప్రవాహం ఎక్కువగా పోతోంది. మెదక్ జిల్లాకు వెళ్లాలంటే నిజాంపేట వద్ద రోడ్డు తెగింది. కామారెడ్డి జిల్లాను సరిహద్దును కలిపే మండలంలోని ఆకారం వాగు బ్రిడ్జిపై నుంచి నీళ్లు ఎక్కువగా పోవడంతో రాకపోకలు నిలిచి పోయాయి. ఇలా ఎటూ చూసినా వీలు లేకుండా పోయింది. ఎక్కడి వారు అక్కడే తమ బంధువుల ఇండ్లల్లోనే ఉండి పోయారు. ఒక వేళ కామారెడ్డికి వెళ్లాలంటే కరీంనగర్ మీదుగా 160 కిలో మీటర్ల దూరం అవుతుంది. ఇంతకు ముందుకు 35 కిలో మీటర్లు ఉండేది. మూడు రోజులుగా ఊర్లకు వెళ్లేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు.

అటవీ భూమి ఆక్రమణ

అడ్డుకున్న అధికారులు.. వాహనాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న, డోజర్లు, జేసీబీలు

శివ్వంపేట(నర్సాపూర్): అటవీ భూమిని కబ్జా చేసేందుకు చదును చేస్తుండగా అధికారులు అడ్డుకున్నారు. ఈ ఘటన మండల పరిధిలోని పిల్లుట్లలో శనివారం చోటు చేసుకుంది. పిల్లుట్ల కంపార పరిధిలో శనివారం పలువురు వ్యక్తులు డోజర్లు, జేసీబీలతో అటవీ భూమిని చదును చేస్తున్నారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని 4 డోజర్లు, 2 జేసీబీలను స్వాధీనం చేసుకుని నర్సాపూర్ అటవీ కార్యాలయానికి తరలించారు. కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డిప్యూటీ రేంజ్ అధికారి సిద్దిరాంసింగ్ తెలిపారు. సెక్షన్ అధికారులు శ్రీధర్ బాబు, రాజమణి, సాయిరాం, బీట్ ఆఫీసర్లు కుమార్, వెంకటేశ్ ఉన్నారు.